సాక్షి
రంగారెడ్డి
మంగళవారం । 24 । జూన్ । 2025



భరోసా ఇవ్వాలి

ఓఆర్ఆర్‌ను ఆనుకుని ఉన్న మండలాలకు రైతు భరోసా విడుదల చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. 8లో▸



ముగిసిన పోలో పోటీలు

జన్వాడ నాసర్ పోలో హార్స్ రైడింగ్ క్లబ్‌లో జరుగుతున్న మాన్‌సూన్ పోలో చాంపియన్ షిప్ పోటీలు ముగిశాయి. 8లో▸



మోదీ పాలనలో పురోగతి

దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు మోదీ నిరంతరం కృషి చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

ప్రభుత్వ భూములను కాపాడాలని వినతి



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న తోల్‌కట్ట గ్రామస్తులు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని తోల్‌కట్టలో ప్రభుత్వ భూములను కాపాడాలని సోమవారం గ్రామస్తులు కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 143, 108, 155, 124, 135, 134, 107లలో పూర్తిగా ప్రభుత్వ భూములు ఉన్నాయని తెలిపారు. ధరణి వచ్చిన తరువాత సర్వే నంబర్లు 107, 124, 135 అక్రమంగా పట్టాలుగా మార్చుకున్నారని, మిగతావి సైతం కబ్జాకు గురవుతున్నాయని అన్నారు. తహసీల్దార్, ఆర్డీఓ, జిల్లా అధికారులకు ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా చొరవ తీసుకొని ప్రభుత్వ భూములను కాపాడాలని కలెక్టర్‌కు విన్నవించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో శివశంకర్‌గౌడ్, మల్లేష్, అంజయ్య తదితరులు ఉన్నారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు



కందుకూరు: ఓ ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. వివరాలివీ.. ఇబ్రహీంపట్నం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సోమవారం మధ్యాహ్నం గుమ్మడవెల్లి మీదుగా ఆకులమైలారం వెళ్లే క్రమంలో అదుపు తప్పింది. గుమ్మడవెల్లి రైతు వేదిక సమీపంలో పొలాలకు వేసిన కడియ రాళ్లను ఢీకొట్టి ఆగిపోయింది. కొంత సేపటి తర్వాత బస్సును అక్కడి నుంచి డ్రైవర్ తీసుకెళ్లాడు. ప్రమాద సమయంలో బస్సులో 25మంది వరకు ప్రయాణికులు ఉన్నారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

గొలుసుకట్టు కాలువల పునరుద్ధరణకు కృషి

ఇరిగేషన్ డీఈ చెన్నకేశవ రెడ్డి



మాసబ్ చెరువు కాలువను పరిశీలిస్తున్న ఇరిగేషన్ డీఈ, ఏఈ

తుర్కయంజాల్: గొలుసుకట్టు కాలువలను పునరుద్ధరించి ఒక చెరువు నుంచి మరో చెరువుకు నీరు సులువుగా ప్రవహించేలా చర్యలు చేపట్టనున్నట్టు ఇరిగేషన్ డీఈ చెన్నకేశవ రెడ్డి తెలిపారు. భారీ వర్షాలు కురిస్తే చెరువులు అలుగు పారే అవకాశాలు ఉండడంతో తుర్కయంజాల్‌లోని మాసబ్ చెరువు, ఇంజాపూర్‌లోని దిలావర్ ఖాన్ చెరువు, ఈదుల చెరువుల కాలువలను ఏఈ వంశీతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ.. కాలువలు పూడిక తీయకంపోవడంతో పలు చోట్ల ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. వరద వచ్చినా సులువుగా ప్రవహించి, కాలనీలు ముంపునకు గురవకుండా చర్యలు తీసుకోనున్నట్టు పేర్కొన్నారు.

యంగ్ ఎర్త్ లీడర్ ప్రోగ్రాంకు పులిమామిడి జెడ్పీహెచ్ఎస్



ప్రధానోపాధ్యాయుడికి ఎంపిక పత్రాన్ని అందిస్తున్న సీజీఆర్ సంస్థ నిర్వాహకుడు

కందుకూరు: డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ (సీజీఆర్) సంయుక్తంగా నిర్వహిస్తున్న యంగ్ ఎర్త్ లీడర్ ప్రోగ్రాంకు మండల పరిధిలోని పులిమామిడి జిల్లా పరిషత్ పాఠశాల ఎంపికైంది. ఇందులో భాగంగా పాఠశాల పరిధిలో వాటర్ హార్వెస్టింగ్ పిట్, కంపోస్టు పిట్, డిక్లేర్ నో ప్లాస్టిక్ జోన్, డిక్లరేషన్ ఆఫ్ మదర్ ట్రీ, కిచెన్ గార్డెన్, సాయిల్ అండ్ సీడ్ మ్యూజియం, మెడిసినల్ గార్డెన్, రెన్యూవల్ ఎనర్జీ (సోలార్), ప్రిపరేషన్ ఆఫ్ విలేజ్ జియోగ్రఫీ మ్యాప్ అండ్ రిపోర్టు, ప్లాంటేషన్ వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం సీజీఆర్ సంస్థ జిల్లా కో–ఆర్డినేటర్ రజనీకాంత్ హెచ్ఎం రవీందర్‌రెడ్డికి ధ్రువపత్రం అందించారు.

సేవలు అంతంతే..

సర్కారు ఆస్పత్రులు సమస్యలు బోలెడు

- సమయపాలన పాటించని వైద్యులు
- అత్యవసర పరిస్థితుల్లో స్టాఫ్‌నర్సులు, ఫార్మాసిస్టులు, ఆయాలే దిక్కు
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- బాధితులకు తప్పని తిప్పలు



చేవెళ్ల: ఓ వైపు ఓపీ రిజిస్ట్రేషన్ మరోవైపు బీపీ చెకింగ్‌తో నిండిపోయిన ప్రభుత్వ ఆస్పత్రి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వ ఆస్పత్రులను నిర్లక్ష్యపు జబ్బు పట్టి పీడిస్తోంది. మందుల కొరత.. మౌలిక సదుపాయాల లేమి.. వెరసి అత్యవసర పరిస్థితుల్లో ఆయా ఆస్పత్రులకు చేరుకున్న నిరుపేద రోగులకు కనీస వైద్య సేవలు అందడం లేదు. ఉదయం 9 గంటలకే ఓపీలో కూర్చోవాల్సిన వైద్యులు 11 దాటినా కన్పించడం లేదు. కొన్ని చోట్ల ఎక్సరే మిషన్లు పని చేయడం లేదు. రేడియాలజిస్టులు లేకపోవడంతో అల్ట్రాసౌండ్ మిషన్లు పనికి రాకుండా పోతున్నాయి. టెక్నీషియన్ల కొరతతో డయాలసిస్ సేవలు అందడం లేదు. వ్యాధి నిర్ధారణ కోసం బాధితుల నుంచి రక్త, మూత్ర పరీక్షల నమూనాలు సేకరించినప్పటికీ రిపోర్టుల జారీలో తీవ్ర జాప్యం జరుగుతోంది. అప్పటికే జబ్బు మరింత ముదురుతుండడంతో మెరుగైన చికిత్స కోసం ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. సోమవారం 'సాక్షి' బృందం జిల్లా వ్యాప్తంగా పట్టణ ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, బస్తీ దవాఖానాలు, పల్లె దవాఖానాల పని తీరుపై విజిట్ నిర్వహించింది. జ్వరం, తలనొప్పి, ఒంటి నొప్పులతో బాధపడుతూ ఉదయం ఎనిమిది గంటలకే అనేక మంది ఆయా ఆస్పత్రులకు చేరుకున్నారు. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. మరికొంత మందికి ఫార్మాసిస్టులు, స్టాఫ్ నర్సులే దిక్కయ్యారు.



ఆమనగల్లు: 10.30 గంటలకు ఖాళీగా ఉన్న డాక్టర్ కుర్చీ

పది దాటినా పత్తాలేని వైద్యులు

ఆమనగల్లు ప్రభుత్వ ఆస్పత్రిలో నలుగురు వైద్యులకు ఉదయం 10.30 గంటల వరకు ఒక్కరూ రాలేదు. వైద్యులు లేకపోవడంతో కుర్చీలు ఖాళీగా కన్పించాయి. ఆలస్యంగా ఆస్పత్రికి రావడమే కాకుండా నిర్దేశిత సమయానికి ముందే తిరిగి వెళ్లి పోయారు. యాచారం సీహెచ్‌సీలోనూ ఇదే పరిస్థితి. పది గంటలలోపు వచ్చిన రోగులకు స్టాఫ్ నర్సులే మందులు, ఇంజక్షన్లు ఇచ్చి పంపారు. కందుకూరు పీహెచ్‌సీ వైద్యురాలు ఉదయం 10.58 గంటలు దాటినా ఆస్పత్రికి చేరుకోలేదు. ఫార్మాసిస్ట్ కూడా ఆలస్యంగా వచ్చారు. వచ్చిన రోగులకు ఏఎన్ఎం పెద్ద దిక్కుగా నిలిచింది.

డయాలసిస్‌కు తప్పని నీటికొరత

ఇబ్రహీంపట్నం ఆస్పత్రిలో మూడు విడతల్లో 32 మందికి డయాలసిస్ చేస్తున్నారు. మరో 18 మంది వెయింటింగ్ లిస్ట్‌లో ఉంటున్నారు. డయాలసిస్ కోసం సరిపడా నీరులేకపోవడంతో వచ్చిన రోగులందరికీ సేవలు అందించలేని పరిస్థితి. ఆస్పత్రిలో ఎనిమిది మంది వైద్యులున్నప్పటికీ సాయంత్రం నాలుగు తర్వాత అందుబాటులో ఉండటం లేదు.

నర్సే చికిత్స చేశారు



చికిత్స కోసం ఉదయం 9 గంటలకే కందుకూరు పీహెచ్‌సీకి వచ్చాను. 10.30 గంటల వరకు చూసినా డాక్టరు రాలేదు. నర్సుతో చికిత్స చేయించుకుని, మందులు తీసుకుని వెళ్తున్నాను. ఇప్పటికి ఇక్కడికి మూడుసార్లు వచ్చాను. ఇంత వరకు వైద్యులతో చికిత్స చేయించుకోలేకపోయాను.

– శ్రీనివాస్‌రెడ్డి, కొత్తూరు, కందుకూరు మండలం

పది మందికి వచ్చింది ఆరుగురే..

- చేవెళ్ల ఏరియా ఆస్పత్రిలో పది మంది వైద్యులు ఉండగా, ఆరుగురే విధులకు హాజరయ్యారు. ఫార్మాసిస్ట్, ఎక్స్‌రే టెక్నీషియన్, ల్యాబ్ అసిస్టెంట్ల కొరతతో వైద్యసేవల్లో జాప్యం జరుగుతోంది. విపరీతమైన జ్వరం, ఒంటి నొప్పులతో బాధపడుతూ ఆస్పత్రికి చేరుకుంటున్న బాధితులకు సగం మందులతో సరిపెడుతున్నారు.లేనివాటిని ప్రైవేటులో కొనుక్కోవాల్సిందిగా సూచిస్తున్నారు.
- కొందుర్గు పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది కొరత వేధిస్తోంది. ఇద్దరు వైద్యులకు ఒక్కరే, అదీ పగటి పూటే అందుబాటులో ఉంటున్నారు. ఏఎన్ఎంలే స్టాఫ్ నర్సుల అవతారం ఎత్తుతున్నారు.
- కొత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ పరీక్షల సేవలు అందడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను బయటికి సిఫార్సు చేస్తున్నారు.
- కేశంపేట ఆస్పత్రిలో పని చేసే ల్యాబ్ టెక్నీషియన్ డిప్యూటేషన్‌పై కొండాపూర్ ఆస్పత్రికి వెళ్లారు. దీంతో నందిగామ, కొందుర్గు పీహెచ్‌సీ టెక్నీషియన్ వారానికి ఒకరోజు వచ్చి వెళ్తున్నారు.
- మహేశ్వరం ప్రభుత్వ ఆస్పత్రిలో ఆరు పోస్టులు ఖాళీ ఉన్నాయి. 16 మంది వైద్యులకు 9మంది మాత్రమే హాజరవుతున్నారు.

అర్జీలకు ప్రాధాన్యత ఇవ్వాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి



కలెక్టర్‌కు సమస్యలు విన్నవిస్తున్న రాందాస్‌పల్లి రైతులు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణి ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి తక్షణమే పరిష్కరించే విధంగా అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్ సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్ఓ సంగీతతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో శాఖల వారీగా స్వీకరించిన అర్జీలపై సంబంధిత అధికారులు సత్వరమే స్పందించాలన్నారు. పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలను పరిష్కరించేలా చూడాలన్నారు. ఈ వారం 76 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు.

వనమహోత్సవానికి ఏర్పాట్లు చేయండి

వన మహోత్సవంలో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మొక్కలు నాటేందుకు స్థలాలను గుర్తించాలని, గుంతలు తీసి సిద్ధంగా ఉంచాలన్నారు. అవసరమైన మొక్కలను నర్సరీల్లో అందుబాటులో ఉంచాలని, నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని తెలిపారు. వర్షకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు చేపట్టాలని జిల్లా వైద్యాధికారికి సూచించారు. రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని వ్యవసాయాధికారులకు చెప్పారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల తహసీల్దారులు, మున్సిపాలిటీ అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత రానివ్వొద్దు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎరువుల కొరత రానివ్వొద్దని కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో వ్యవసాయశాఖ అధికారులు, డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా పండే పంటలు, అవసరమైన ఎరువులపై ముందే ఒక అంచనాకు రావాల్సి ఉందన్నారు. రైతుల అవసరాల మేరకు ఎరువులను అందుబాటులో ఉంచాలని, గోదాముల్లో నిల్వ చేయాలని సూచించారు. నకిలీ విత్తనాలు, నిర్దేశిత ధరలకు మించి ఎరువులను విక్రయించే వారిపై చర్యలు తప్పవన్నారు. ఉద్దేశ పూర్వకంగా రైతులను ఇబ్బందులకు గురి చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు, డీసీఎస్ఓ, మండలాల వ్యవసాయ అధికారులు, డీలర్లు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బలహీనవర్గాల అభ్యున్నతే ధ్యేయం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



సభలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

మంచాల: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిషలు పని చేసేది సీపీఎం అని పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. మండలంలోని ఆస్మత్‌పూర్‌లో సోమవారం నిర్వహించిన పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ నర్ల భిక్షపతి వర్ధంతి సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నర్ల భిక్షపతి స్థూపం నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. కార్మికులు, కర్షకులను చైతన్యపర్చి, వారి హక్కుల కోసం ఉద్యమించే పార్టీ సీపీఎం అని పేర్కొన్నారు. ప్రజల కోసం పోరాటాలు చేసి ఎంతోమంది అమరులయ్యారని తెలిపారు. ఈ ప్రాంతంలో అనేక భూపోరాటాలు, రైతు, కూలీ సమస్యలపై ఉద్యమాలు నడిపిన చరిత్ర ఉందన్నారు. అట్టడుగు వర్గాల కోసం కమ్యూనిస్టులు చేసిన త్యాగాలు మర్చిపోలేనివన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పగుడాల యాదయ్య, మండల కార్యదర్శి రావుల జంగయ్య, మండల నాయకులు కె.శ్రీనివాస్‌రెడ్డి, శ్యాంసుందర్, గోరెంకల నర్సింహ, మాజీ వైస్ ఎంపీపీ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ లక్ష్మీనారాయణ

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

- షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ

కేశంపేట: సమాజంలో అందరూ యూనిఫాం లేని పోలీసులేనని షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించి నేరాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ అమ్మినా, కొనుగోలు చేసినా, రవాణా చేసినా, నిల్వ కలిగి ఉన్నా చట్టరీత్యా నేరమని తెలిపారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చిన ఫోన్ కాల్స్ నమ్మొద్దని, ఓటీపీలు ఎవరికీ చెప్పొద్దన్నారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని ఆయన సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీఐ నరహరి, ఎస్ రాజ్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విద్యావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించాలి

- బనకచర్ల ప్రాజెక్టుతో రాష్ట్రానికి నష్టం జరగనీయం
- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ



కమ్మదనంలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఎంపీ డీకే అరుణ

షాద్‌నగర్: సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసును రాష్ట్ర ప్రభుత్వం సీబీఐకి అప్పగించాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. కమ్మదనం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛను హరిస్తూ గత పాలకులు స్వార్థరాజకీయాలకు పాల్పడి, ప్రజా జీవితాలకు భంగం కలిగే విధంగా వ్యవహరించారని విమర్శించారు. భార్యాభర్తలు మాట్లాడుకున్న మాటలు కూడా వినడం సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన సూత్రధారులు, పాత్రదారులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బనకచర్ల ప్రాజెక్టు గురించి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కేంద్రంతో మాట్లాడారని, తెలంగాణకు ఏవిధంగా నష్టం జరుగుతుందో స్పష్టంగా వివరించారని తెలిపారు. ఈ విషయంలో కేంద్రానికి స్పష్టత ఉందన్నారు. ఏ ప్రాజెక్టు విషయంలోనైనా తెలంగాణకు అన్యాయం జరగకుండా చూస్తామన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం పార్టీ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీవర్ధన్ రెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి, అశోక్‌గౌడ్, మోహన్‌సింగ్, విజయ్ భాస్కర్, ఇస్నాతి శ్రీనివాస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో స్వచ్ఛ 'సర్వే'క్షణ్

- పంచాయతీలకు ర్యాంకులు
- సర్వే ఆధారంగా ఎంపిక ప్రక్రియ
- ఉత్తమ గ్రామాలకు పురస్కారం
- పారిశుద్ధ్యం మెరుగుపర్చడమే లక్ష్యం



ఎస్‌బీపల్లిలో పారిశుద్ధ్య పనులు (ఫైల్)

కొత్తూరు: పంచాయతీల మధ్య పోటీతత్వాన్ని పెంచడంతో పాటు పారిశుద్ధ్య పరిస్థితులను మరింత మెరుగుపర్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఏటా స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అధికారులు, సిబ్బంది గ్రామాల్లో పర్యటించి సర్వే చేసిన వివరాల ఆధారంగా పాయింట్లు కేటాయిస్తారు. ఆయా విభాగాల్లో ఎక్కువ పాయింట్లు సాధించిన పంచాయతీలను గుర్తించి ర్యాంకులు ప్రకటించి పురస్కారాలు అందజేస్తారు. ఈ ఏడాది (2025) సైతం త్వరలో కేంద్ర బృందాలు గ్రామాల్లో పర్యటించి సర్వే చేపట్టనున్నాయి. గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు, అభివృద్ధి పనులపై అధికారులు పంపిన నివేదికల ఆధారంగా సభ్యులు క్షేత్రస్థాయిలో సర్వే చేయనున్నారు.

పరిశీలించే అంశాలు

- ప్రతిఇంట్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం జరిగిందా.. ఇంకా గ్రామాల్లో బహిరంగ మల విసర్జన జరుగుతోందా.. అందరూ మరుగుదొడ్లు వినియోగిస్తున్నారా.. అనే విషయాలు తెలుసుకుంటారు.
- పారిశుద్ధ్య సిబ్బంది నిత్యం చెత్తను సేకరించే విధానం.. వర్షపు నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాలను పెంచేందుకు అధికారులు ఇంకుడు గుంతల నిర్మాణాలపై అవగాహన కల్పించారా.. ప్రజలు స్వతహాగా నిర్మించుకున్నారా.. అనేది గ్రహిస్తారు.
- డంప్‌యార్డుల నిర్మాణం, వ్యర్థాల నిర్వహణ, మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ కోసం తీసుకుంటున్న చర్యలను గుర్తిస్తారు.
- అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ, తాగునీటి సరఫరా, బహిరంగ ప్రదేశాల్లో పారిశుద్ధ్య నిర్వహణ తీరును పరిశీలించనున్నారు.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయా.. వాటి ద్వారా లబ్ధి పొందుతున్నారా.. అనే విషయాలు తెలుసుకుంటారు.
- పలు అంశాల్లో సభ్యులు క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి వెయ్యి మార్కులకు గాను అధిక స్కోర్ సాధించిన గ్రామాలను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపనున్నారు.

ముందస్తు సమాచారం ఉండదు

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ఆయా గ్రామాలకు వెళ్లే అధికారుల ముందస్తు సమాచారం సంబంధిత పంచాయతీలకు ఉండదు. అధికారులు నిర్ణయించుకున్న మేరకు వెళ్లి పలు నివాస గృహాలు, వ్యాపార సముదాయాలతో పాటు పలుచోట్ల సర్వే చేపట్టనున్నారు.

ఉన్నతాధికారుల సూచన మేరకు..



స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంపై త్వరలో సమావేశం జరుగుతుంది. ఉన్నతాధికారుల సూచనల మేరకు గ్రామాల్లో అన్ని రకాల పనులు చేపడతాం. ఇప్పటికే అన్ని పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణ, చెత్తను సేకరించడం జరుగుతోంది.

– విజయలక్ష్మి, ఎంపీఓ, కొత్తూరు

విపక్షాలది దుష్ప్రచారం

- నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మల్లురవి

ఆమనగల్లు: రాష్ట్రంలో ప్రజాసంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ప్రభుత్వంపై విపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని నాగర్‌కర్నూల్ ఎంపీ డా.మల్లురవి అన్నారు. పట్టణంలో సోమవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నా ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అని పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఒక్క ఇల్లూ ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని తెలిపారు. తొమ్మిది రోజుల్లో రూ.9వేల కోట్లు రైతుభరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ చేసినట్టు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేని బీఆర్ఎస్, బీజేపీ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని ఎంపీ మల్లురవి మండిపడ్డారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో పీసీబీ మాజీ సభ్యుడు బాలాజీసింగ్, పీసీసీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, మార్కెట్ మాజీ వైస్‌చైర్మన్ గుర్రం కేశవులు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మాణయ్య, చేనేత సంఘం మాజీ అధ్యక్షుడు కోట కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్ఆర్ పరిధిలోనూ భరోసా ఇవ్వాలి


ఎల్మినేడులో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- ఇబ్రహీంపట్నం మాజీ ఎంపీపీ కృపేశ్
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎల్మినేడులో ధర్నా

ఇబ్రహీంపట్నం రూరల్: ఓఆర్ఆర్‌ను ఆనుకుని ఉన్న మండలాలకు రైతు భరోసా విడుదల చేయాలని ఇబ్రహీంపట్నం మాజీ ఎంపీపీ కృపేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు బీఆర్ఎస్ ఎల్మినేడు గ్రామ అధ్యక్షుడు దొమకొండ నర్సింహ అధ్యక్షతన మహాధర్నా చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కృపేష్, బుగ్గరాములు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రెండు దఫాలుగా రైతు భరోసా ఇవ్వకపోవడం సిగ్గు చేటు అన్నారు. నియోజకవర్గ పరిధిలోని అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం మండలాల రైతులు ఓట్లు వేయలేదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో వివక్ష చూపకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తోందన్నారు. రైతులపై వివక్ష చూపడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతు భరోసా విడుదల చేయకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల మాజీ అధ్యక్షుడు మొద్దు అంజిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, బుట్టి మహేశ్, నిట్టు జగదీశ్వర్, బాష, యాదయ్య, రాజు, విష్ణువర్ధన్‌రెడ్డి, రాంరెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

ముగిసిన మాన్‌సూన్ పోలో చాంపియన్‌షిప్


విన్నర్, రన్నరప్ జట్లకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

శంకర్‌పల్లి: మండల పరిధిలోని జన్వాడ నాసర్ పోలో హార్స్ రైడింగ్ క్లబ్‌లో మూడు రోజులుగా మాన్‌సూన్ పోలో చాంపియన్ షిప్–2025 పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో రాజస్థాన్ రంబుల్, హర్యానా హరికేన్, తెలంగాణ థండర్ తదితర జట్లు పాల్గొన్నాయి. ఆదివారం నిర్వహించిన ఫైనల్లో తెలంగాణ థండర్స్ తొమ్మిది గోల్స్ చేయగా.. హర్యానా హరికేన్ 11గోల్స్ చేసింది. దీంతో రెండు గోల్స్ తేడాతో హర్యానా హరికేన్ జట్టు చాంపియన్ షిప్–2025 కప్‌ని సొంతం చేసుకుంది. విజేత జట్టుకు తెలంగాణ–ఆంధ్ర సబ్ ఏరియా ఆఫీసర్ మేజర్ జనరల్ అజయ్ మిశ్రా షీల్డ్ అందజేశారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా ఆసఫ్ జాహీ వంశానికి చెందిన 9వ నవాబు రౌనక్ యార్ ఖాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాసర్ పోలో హార్స్ రైడింగ్ క్లబ్ సీఈఓ మీర్ హఫీజుద్దీన్ మాట్లాడుతూ.. హార్స్ రైడింగ్ చేసేందుకు యువత ఆసక్తి చూపుతున్నారని.. దీన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామన్నారు.

రూ.30 లక్షల కొకైన్ స్వాధీనం

ముగ్గురికి రిమాండ్

రాజేంద్రనగర్: గోవా నుంచి కొకైన్‌తో పాటు మత్తు పదార్థాలు తీసుకొచ్చి విక్రయిస్తున్న ఓ ముఠాను నార్సింగి, తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో అధికారులు పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి 107 గ్రాముల కొకైన్, 25గ్రాముల మత్తు పదార్థాల పిల్స్ (మాత్రలు) ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.30 లక్షల ఉంటుందని రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం సాయంత్రం డీసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... నైజీరియా దేశానికి చెందిన ఓనేకా (22) 2022లో స్టూడెంట్ వీసాపై నకిలీ పాస్‌పోర్టుతో గుజరాత్‌కు వచ్చాడు. నకిలీ పాస్‌పోర్టు కేసులో ఇతన్ని పాస్‌పోర్టును సీజ్ చేసి కేసు నమోదు చేశారు. 2024లో నైజీరియాకు వెళ్లిన ఓనేకా తన ఒరిజినల్ పాస్‌పోర్టుతో భారతదేశానికి వచ్చి గోవాలో ఉంటున్నాడు. 2022 నుంచి ఇతనికి నైజీరియా నుంచి డ్రగ్స్ సరఫరా చేస్తున్న బాచీతో సంబంధాలు ఉన్నాయి. కొకైన్‌తో పాటు ఇతర మత్తు పదార్థాలను విక్రయించడం ప్రారంభించాడు. ఈ క్రమంలో మణికొండకు చెందిన వెడ్డింగ్ ప్లానర్ గోపిశెట్టి రాజేశ్ (40)తో పరిచయం ఏర్పడింది. ఇతని స్నేహితుడు రాజమండ్రికి చెందిన రియల్ వ్యాపారి బొమ్మదేవర వీరరాజు (32) పరిచయం ఏర్పడింది. వీరు ముగ్గురు కలిసి గతంలో మత్తు పదార్థాలను సరఫరా చేశారు. గచ్చిబౌలి పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లి వచ్చారు. గోవాకు వెళ్లి ఓనేకా కొకైన్‌తో పాటు మత్తు పదార్థాలను తీసుకొచ్చాడు. వీటిని గత నెలలో మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో జరిగిన రేవ్ పార్టీతో మోకీలాలో, గత నెల 31వ తేదీన మంగళగిరిలో ఫణిరాజుకు కొకైన్‌ను విక్రయించారు. మిగిలిన కొకైన్‌తో పాటు మత్తు పదార్థాలను తమకున్న పరిచయాలతో వాట్సాప్ ద్వారా విక్రయించేందుకు ప్రయత్నించారు. ఈ విషయం తెలుసుకున్న నార్కోటిక్ అధికారులు, పోలీసులు మణికొండ అల్కాపురిలోని గోపిశెట్టి రాజేశ్ ఇంటిపై దాడి చేసి ముగ్గురు నిందితులను పట్టుకుని సోమవారం రిమాండ్‌కు తరలించారు. నిందితుల సెల్‌ఫోన్లలో కొకైన్, మత్తు పదార్థాలను ఎవరెవరికి సరఫరా చేశారన్న సమాచారాన్ని సేకరిస్తున్నట్లు డీసీపీ తెలిపారు. సెల్‌ఫోన్ వాట్సాప్ గ్రూపుల్లో ఇందుకు సంబంధించిన చాటింగ్‌ను సైతం పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

రూ.7 కోట్ల విలువైన భూమికి ఎసరు!

చిల్కమర్రి రెవెన్యూ సదస్సులో వెలుగులోకి..

- అధికారులను ఆశ్రయించిన బాధితులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన తహసీల్దార్



షాద్‌నగర్ రూరల్: ధరణి లొసుగులు.. మీసేవ నిర్వాహకుల సహకారంతో తండ్రీకొడుకులు రూ.7 కోట్ల విలువైన నాలుగు ఎకరాల భూమికి ఎసరుపెట్టారు. ప్రభుత్వం ఇటీవల చిల్కమర్రిలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఈ వ్యవహారం బయటకు పొక్కింది. బాధితులు రెవెన్యూ అధికారులను ఆశ్రయించడంతో తహసీల్దార్ ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మీసేవ నిర్వాహకులతో కుమ్మక్కై..

గ్రామానికి చెందిన కొత్తపల్లి వినోద, శ్రీనివాస్‌రెడ్డి దంపతులు. కొంత కాలం క్రితం శ్రీనివాస్‌రెడ్డి చనిపోవడంతో ఆయన పేరిట ఉన్న 2.8 ఎకరాల భూమి 2022లో వినోద పేరిట విరాసత్ జరిగింది. ఈ భూమిపై కన్నేసిన వినోద మామ సుభాన్‌రెడ్డి, బావ మధుసూదన్ రెడ్డి పట్టణంలోని ఓ మీసేవ నిర్వాహకులతో కుమ్మక్కయ్యారు. వినోదకు తెలియకుండా ఆమె ఫోన్‌కు వచ్చిన ఓటీపీని సంపాదించి దొంగ జీపీఏ డాక్యుమెంట్ సృష్టించారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భూ వివరాలు తెలుసుకునేందుకు రెవెన్యూ అధికారులను ఆశ్రయింగా జీపీఏ ద్వారా ఇతరులకు మారిందని చెప్పారు. సదస్సులు ముగిసిన తర్వాత వినోద తహసీల్దార్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది.

ఇదే గ్రామంలో మరొకరి భూమిని

ఇదే గ్రామానికి చెందిన కొత్తపల్లినర్సింహారెడ్డి, నవనీత దంపతులకు మనస్పర్థలు రావడంతో వేర్వేరుగా నివాసం ఉంటున్నారు. నర్సింహారెడ్డి పేరిట 1.29 ఎకరాల భూమిని కాజేసేందుకు సుభాన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి ఆమె భార్య నవనీతను రంగంలోకి దింపారు. భర్త ఫోన్ నవనీత దగ్గరే ఉండడంతో ఓటీపీ తీసుకుని జీపీఏ డాక్యుమెంట్ సృష్టించారు. సదరు భూమిని దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డికి సేల్‌డీడ్ చేశారు. తహసీల్దార్ విచారణలో ఈ తతంగమంతా బయటపడింది. ఇద్దరు పట్టాదారులకు సంబంధించి రూ.7కోట్ల విలువైన దాదాపు నాలుగు ఎకరాల భూమిని కాజేసినట్లు తేలింది.

పోలీస్‌స్టేషన్‌లో తహసీల్దార్ ఫిర్యాదు

పట్టాదారులకు తెలియకుండా భూములు చేతులు మారడంతో తహసీల్దారు పార్థసారధి సదరు భూముల రిజిస్ట్రేషన్‌పై విచారించారు. స్లాట్ బుకింగ్, డాక్యుమెంట్ తయారీ ఎక్కడ జరిగిందనే విషయాలను పరిశీలించారు. మీసేవ సెంటర్‌లో ఓటీపీలతో డాక్యుమెంట్ తయారు చేసినట్లు గుర్తించారు. సదరు మీసేవ నిర్వాహకులతో పాటుగా దొంగ జీపీఏ, రిజిస్ట్రేషన్ చేసిన వారిపై ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మోదీ పాలనలో దేశం పురోగతి


చేవెళ్లలో మొక్క నాటుతున్న కేఎస్ రత్నం తదితరులు

చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

చేవెళ్ల: దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రధాని మోదీ నిరంతరం కృషి చేస్తున్నారని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం అన్నారు. స్థానిక కేవీఆర్ గ్రౌండ్‌లో సోమవారం చేవెళ్ల మున్సిపాలిటీ బూత్‌స్థాయిలో తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పించారు. మోదీ సారథ్యంలో దేశం ఎంతో పురోగతి సాధించిందన్నారు. తల్లికి వందనంతో దేశంలో పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రతీ బూత్‌లో కనీసం 50 మొక్కలు నాటాలని, నియోజకవర్గంలో 25వేల మొక్కలు నాటాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని స్పష్టంచేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధ్వానం పాలన సాగిస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్‌రెడ్డి, యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు విఠల్‌రెడ్డి, జిల్లా నాయకులు వెంకట్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, కుంచం శ్రీనివాస్, నాయకులు మధుసుధన్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, మధుసుధన్ రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలోంచి పుస్తెలతాడు చోరీ

యాచారం: బస్సు కోసం వేచి చూస్తున్న మహిళ మెడలోంచి గుర్తు తెలియని వ్యక్తులు బంగారు పుస్తెల తాడును అపహరించారు. యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... మాడ్గుల మండలం అప్పారెడ్డిపల్లికి చెందిన బండ పార్వతమ్మ(58) సోమవారం మధ్యాహ్నం స్వగ్రామానికి వెళ్లేందుకు నక్కర్తమేడిపల్లిలోని బంధువుల ఇంటి నుంచి తక్కళ్లపల్లి గేట్ వద్దకు వచ్చింది. ఇది గమనించిన ఇద్దరు గుర్తు తెలియని దుండగులు హెల్మెట్ ధరించి, బైక్‌పై వచ్చారు. బస్సు కోసం వేచి చూస్తున్న పార్వతమ్మ మెడలోని మూడు తులాల పుస్తెల తాడును లాక్కెళ్లారు. ఈ సమయంలో పార్వతమ్మ కింద పడిపోయినా దుండగులు మాత్రం తాడు వదల్లేదు. ఈ విషయమై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, నాగార్జునసాగర్– హైదరాబాద్ రహదారి వెంట ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

మేస్త్రీ అదృశ్యం


రాములు(ఫైల్)

మొయినాబాద్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన మేస్త్రీ అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లా దౌల్తాబాద్‌కు చెందిన దాగునపురం రాములు(40) భార్య లక్ష్మితో కలిసి మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరులో నివాసం ఉంటూ మేస్త్రీ పనిచేస్తున్నాడు. కాగా ఆదివారం రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం మొయినాబాద్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

సీసీ కెమెరాలు, ఎన్వీఆర్ డివైస్ తస్కరణ

కడ్తాల్: మండల కేంద్రంలోని పాలశీతలీకరణ కేంద్రంలో సీసీ కెమెరాలతో పాటు, ఎన్వీఆర్ డివైస్ చోరీకి గురైంది. ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. సీఐ గంగాధర్ తెలిపిన ప్రకారం.. పాలశీతలీకరణ కేంద్రంలోని ల్యాబ్‌లో నిఘా కోసం ఏర్పాటు చేసిన రెండు సీసీ కెమెరాలు, ఎన్వీఆర్ డివైస్‌ను ఏర్పాటు చేశారు. ఈ నెల 21న గుర్తు తెలియని దుండగులు వీటిని ఎత్తుకెళ్లారు. సోమవారం గమనించిన పాలశీతలీకరణ కేంద్రం ఇన్‌చార్జి మేనేజర్ ఉదయశ్రీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.

నీటి గుంతలో పడి మహిళ మృతి

మొయినాబాద్: బతుకుదెరువుకు వలస వచ్చిన ఓ మహిళ దుస్తులు ఉతకడానికి వెళ్లి నీటి గుంతలో పడి మృతి చెందింది. ఈ సంఘటన మొయినాబాద్‌లో సోమవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన ప్రకారం కర్ణాటక రాష్ట్రం రిబ్బన్‌పల్లికి చెందిన మంజుల(31) కుటుంబం కొన్నేళ్ల క్రితం మొయినాబాద్‌కు వలస వచ్చింది. కొంత కాలం క్రితం ఆమె భర్త రవికుమార్ మృతి చెందాడు. ముగ్గురు పిల్లలతో కలిసి సురంగల్ రోడ్డు పక్కన ఓ గుడిసె వెసుకుని కూలీ పనిచేస్తూ పిల్లలను పోషిస్తోంది. ఆదివారం మొయినాబాద్ సమీపంలో కొత్తగా నిర్మిస్తున్న బైపాస్ రోడ్డు పక్కన ఉన్న ఓ నీటి గుంతలో దుస్తులు ఉతికేందుకు వెళ్లింది. ప్రమాదవశాత్తు కాలుజారి అందులో పడిపోయింది. సోమవారం అటుగా వెళ్లిన ఓ వ్యక్తి గుంతలో తేలిన శవాన్ని గమనించి, మున్సిపల్ వార్డు అధికారి సుదర్శన్‌కు సమాచారం అందించాడు. ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలికి చేరుకున్న వారు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రీల్స్ కోసం బైక్‌పై ప్రమాదకర స్టంట్

ఎనిమిది మంది యువకుల అరెస్టు


ద్విచక్ర వాహనంపై స్టంట్ చేస్తున్న యువకులు

రాజేంద్రనగర్: ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా ఎనిమిది మంది యువకులు ఓ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనంపై అర్ధరాత్రి రీల్స్ కోసం స్టంట్ చేశారు. జాతీయ రహదారిపై ఈ స్టంట్ కొనసాగుతుండటంతో ఈ దారి గుండా వెళ్తున్న వారు తమ సెల్‌ఫోన్‌లో బంధించి ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుకు వెళ్లే దారిలో ఇలాంటి స్టంట్ అర్ధరాత్రి వేళ జరుగుతుండటంతో పలువురు తమ ఎక్స్ వేదికల ద్వారా దీనిని సైబరాబాద్ పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన పోలీసులు నిందితులను పట్టుకొని ఆర్‌జీఐ పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన వారిలో ముగ్గురు మైనర్లు ఉండటం గమనార్హం. రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 21న అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో శంషాబాద్ ప్రాంతానికి చెందిన ఎనిమిది మంది యువకులు ద్విచక్ర వాహనంపై శంషాబాద్ నుంచి ఆరాంఘర్ వైపు పయనమయ్యారు. ద్విచక్ర వాహనంపై ముగ్గురు మైనర్లతో పాటు ఐదుగురు యువకులు పయనిస్తూ రీల్స్ చేశారు. ప్రమాదభరితంగా ఈ జాతీయ రహదారిపై స్టంట్ నిర్వహించారు. ఈ దృశ్యాలను అటుగా వెళుతున్న పలువురు చిత్రీకరించి ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుకు వెళ్లే ఈ రహదారి రాత్రి సమయాల్లో బిజీగా ఉంటుంది. అర్ధరాత్రి సమయంలో వీఐపీల రాకపోకలతో అలర్ట్‌గా ఉంటుంది. ఈ స్టంట్ విషయమై పలువురు సైబరాబాద్ పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. సైబరాబాద్ పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు సీసీ కెమెరాల ద్వారా నిందితులను సోమవారం గుర్తించారు. ద్విచక్ర వాహనంతో పాటు ఐదుగురు యువకులను, ముగ్గురు మైనర్లను రాజేంద్రనగర్ పోలీసులకు సోమవారం సాయంత్రం అప్పగించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తక్కువ ధరకు బంగారమంటూ టోకరా!

చౌటుప్పల్ వ్యాపారి నుంచి రూ.65 లక్షలు స్వాహా

- చాదర్‌ఘాట్‌లోని ఎంజీబీఎస్ సమీపంలో ఘటన
- కర్ణాటకకు చెందిన ప్రధాన సూత్రధారి అరెస్ట్
- రూ.40 లక్షలు రికవరీ, పరారీలో మరో ఇరువురు



సాక్షి, సిటీబ్యూరో: చౌటుప్పల్‌కు చెందిన ఓ రియల్టర్ వ్యాపారాభివృద్ధి కోసం తన పేరు, ఫోన్ నెంబర్ కార్యాలయంపై రాసుకోవడమే శాపమైంది. అలా లభించిన ఫోన్ నెంబర్ ఆధారంగా ఆయనకు కాల్ చేసిన కర్ణాటక ముఠా తక్కువ ధరకు బంగారం పేరుతో రూ.65 లక్షలు స్వాహా చేసింది. దీనిపై కేసు నమోదు చేసుకున్న అఫ్జల్‌గంజ్ పోలీసులు ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి దర్యాప్తు చేశారు. ఫలితంగా ప్రధాన సూత్రధారిని పట్టుకోవడంతో పాటు రూ.40 లక్షలు రికవరీ చేసినట్లు తూర్పు మండల డీసీపీ డాక్టర్ బి.బాలస్వామి సోమవారం తెలిపారు. అదనపు డీసీపీ జె.నర్సయ్య, సుల్తాన్ బజార్ ఏసీపీ ఎం.మట్టయ్యలతో కలిసి తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పూర్తి వివరాలు వెల్లడించారు.

తెలుగు రాష్ట్రాల్లో తిరుగుతూ మోసాలు

కర్ణాటకలోని రాయచూర్‌కు చెందిన కొన్ని ముఠాలు తెలుగు రాష్ట్రాలనే టార్గెట్‌గా చేసుకుని మోసాలు చేస్తున్నాయి. పొలం దున్నుతుంటేనో, పాత ఇంటిని కూలుస్తుంటేనో నిధి లభించిందని చెప్తారు. అందులో ఉన్న బంగారం ప్రభుత్వం స్వాధీనం చేసుకోకుండా దాచామని, సగం ధరకే ఇస్తామంటూ ఎర వేస్తారు. వీళ్లు టార్గెట్లను ఎంచుకోవడానికి వివిధ ప్రాంతాల్లో సంచరిస్తూ వ్యాపార ప్రకటనలు, దుకాణాలపై ఉన్న పేర్లు, ఫోన్ నెంబర్లు ఎంచుకుంటారు. వీరి వల్లోపడుతున్న వారిలో అత్యధికులు రియల్టర్లు, చిన్న స్థాయి బంగారం వ్యాపారులే ఉంటున్నారు. ఇలాంటి ముఠాల్లో తాళ్ల వ్యాపారి జయ కుమార్‌ది ఒకటి. తన బావ మరిది ఉదయ్, స్నేహితుడు సందీప్‌తో కలిసి రంగంలోకి దిగాడు.

బోర్డుపై ఉన్న ఫోన్ నెంబర్ ఆధారంగా

చౌటుప్పల్‌కు చెందిన మునుకుంట్ల నిరంజన్ అక్కడి భరత్‌నగర్ కాలనీలో శ్రీ బాలాజీ రియల్ ఎస్టేట్స్ పేరుతో సంస్థను నిర్వహిస్తున్నారు. జయ కుమార్ నేతృత్వంలోని ముఠా ఈ ఏడాది మార్చిలో ద్విచక్ర వాహనాలపై సిటీకి వచ్చింది. చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల్లో సంచరిస్తూ టార్గెట్ల కోసం అన్వేషించింది. చౌటుప్పల్‌లో సంచరిస్తున్నప్పుడు వారి కంట్లో నిరంజన్ కార్యాలయం బోర్డు పడింది. అందులో ఉన్న ఫోన్ నెంబర్ ఆధారంగా రెడ్డి పేరుతో ఉదయ్ సంప్రదించాడు. సగం ధరకు బంగారమంటూ ఎర వేశాడు. అదే నెల్లో రూ.25 వేలు తీసుకుని అరతులం బంగారం ఇచ్చాడు. దీన్ని పరీక్షించిన నిరంజన్ మేలిమి బంగారంగా తెలుసుకున్నారు. ఆపై తన స్నేహితుడు దేవేందర్‌తో కలిసి రూ.65 లక్షలకే కేజీ ఖరీదు చేయడానికి సిద్ధయ్యారు. ఈ సందర్భంలో వీరితో రఘు పేరుతో సందీప్ కూడా సంప్రదింపులు జరిపాడు.

'అంబర్‌పేట' నుంచి అఫ్జల్‌గంజ్ వరకు

గత నెల 12న కేజీ బంగారం సిద్ధంగా ఉందని ఫోన్ చేసిన రఘు నగదు తీసుకుని పెద్ద అంబర్‌పేట రమ్మని చెప్పాడు. దీంతో నిరంజన్ (రూ.45 లక్షలు), ఇతడి స్నేహితుడైన ధర్మేంద్ర (రూ.20 లక్షలు) ఇద్దరూ కలిసి రూ.65 లక్షలు తీసుకుని తమ కారులో పెద్ద అంబర్‌పేటకు వచ్చారు. నిరంజన్‌తో ఫోనులో సంప్రదింపులు జరుపుతున్న రెడ్డి... అక్కడ నుంచి వారిని ఎల్బీనగర్‌కు, ఆపై దిల్‌సుఖ్‌నగర్ రప్పించి చివరకు ఎంజీబీఎస్ సమీపంలోకి రమ్మన్నారు. అక్కడ వీరిని కలిసిన రఘు వారి వాహనంలోనే ఎక్కాడు. కొద్దిసేపటికి ద్విచక్ర వాహనంపై వచ్చిన జయ కుమార్, రెడ్డి బంగారం ఉందంటూ ఓ బ్యాగ్ ఇచ్చి, నగదుతో కూడిన బ్యాగ్ పట్టుకుపోయారు. అప్పటి వరకు వారితోనే ఉన్న రఘు సైతం దృష్టి మళ్లించి మరో వాహనంపై ఉడాయించాడు. నిరంజన్ ఆ బ్యాగ్ తెరిచి చూడగా... పైన చీరలు, కింద నాపరాళ్లు కనిపించడంతో మోసపోయినట్లు గుర్తించాడు.

ముమ్మరంగా గాలించిన ప్రత్యేక బృందం

బాధితుల ఫిర్యాదుతో అఫ్జల్‌గంజ్ ఠాణాలో కేసు నమోదు కాగా... ఇన్‌స్పెక్టర్ ఎస్.రవి, డీఐ రవికిరణ్ నేతృత్వంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. సాంకేతిక అంశాలతో పాటు సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాల ఆధారంగా నిందితుల ఆచూకీ కనిపెట్టారు. నిందితుల కోసం కర్ణాటకతో పాటు నగరంలోనూ ముమ్మరంగా గాలించారు. సోమవారం ఎంజీబీఎస్ వద్దకు కారులో చేరుకున్న జయ కుమార్‌ను పట్టుకున్నారు. ఇతడి నుంచి కారుతో పాటు రూ.40 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన రూ.25 లక్షలు ఉదయ్, సందీప్ వద్ద ఉన్నట్లు జయ కుమార్ బయటపెట్టాడు. దీంతో పరారీలో ఉన్న వారి ధ్దరి కోసం గాలింపు కొనసాగిస్తున్నారు.